అనుకున్నాడు 'దేవి ఇంత భయంకరంగా ఉందేమిటి? నిత్యమంగళంగా చిరునవ్వు పెదబిల్లే అమ్మవారేనా ఈమె? చెడును చెండాడేటప్పుడు ఆమె ధరించిన ఆకారం అయ్యుంటుంది. మరయితే ఆమె ప్రసన్నరూపానికి బదులు, చెడుకి చిహ్నమైన ఈ రౌద్రాకారాన్ని పూజించట మెందుకు? కాళీ విగ్రహాన్ని పూజించటంలా, అలాగే ఇది కూడా. ఆమెను గురించి భయపడి జనం సన్మార్గులవుతున్నారు కాబోలు. దేవి అంటే భయపడి భక్తులయ్యేవారు కొందరు. దేవియందలి భక్తితో భక్తులయినవారు మరికొందరు. ఈ రెండు మార్గాలు చేర్చే చోటు ఒకటేనేమో కాని, ఒక మార్గంలో ప్రయాణించేవాడికి రెండో మార్గం నచ్చదు. కళ్ళు తెరిచి చూశాడు రాముడు. మొదట్లో ఉన్నంత భయంకరంగా లేదు అమ్మవారు. అమరేశ్వరి గుళ్ళో చాముండేశ్వరి చెల్లెలులా ఉంది. 'నేను పొందిన భయం దేవి విగ్రహంలోది కాదు. నా గుండెలోది. అంతా చూడటంలోనే ఉంది' అనుకున్నాడు రాముడు.

పంబలవాడు రాముడికీ, సీతాపతికీ పెద్దపెద్ద కుంకుమబొట్లు పెట్టాడు. ఇద్దరూ చెరుపుకోకుండా ఉంచుకుందాం అనుకున్నారు. పందిళ్ళలో జనం క్రమక్రమంగా పోగవుతున్నారు. పిల్లలు సంబరాలుగా పందిళ్ళనిండా పరుగెడ్తున్నారు. కొంతమంది వాళ్ళని అదిలిస్తున్నారు. వాళ్ళు అదిలించినకొద్దీ గోలచేస్తున్నారు. ఒక పక్కన తాటాకుల మంటవేసి డప్పులు వేడిచేస్తున్నారు. కాగిన డప్పుల చర్మం బిరుసెక్కి దెబ్బవేస్తే ఖణేలున మోగుతోంది.

వీరాస్వామి, మున్సబు, ఊళ్లో కొందరు పెద్దరైతులు పందిట్లోకి వచ్చారు. రాముణ్ణీ, సీతాపతిని పలుకరించారు.

"మీ అయ్య రాలేదా రామయ్యా" అనడిగాడు మున్సబు.

"లేదండీ కొంచెం పనుందిట. నన్ను పంపించాడు" అన్నాడు రాముడు.

"కొడుక్కి అప్పుడే తర్ఫీదిస్తునాడయ్యోవ్" అన్నాడు వీరాస్వామి.

కల్లుకంపు గప్పుమంది. సీతాపతి ముఖం ఇంకోవైపు తిప్పుకున్నాడు. పందిరి కవతలగా డప్పులు ఒకే బిగిన మోగిస్తుంటే పందిళ్ళన్నీ మోగిపోతున్నాయి. ఆ మోతలో ఒకళ్ళ కేకలు ఒకళ్లకందక పెద్దగా అరచుకుంటున్నారు. ఆ అరుపులు, కల్లువాసనలు గాలిలో తేల్తున్నాయి.

"ఏరా సీతాపతీ నీ కేమన్నా భయంగా ఉందా?" అన్నాడు రాముడు.

"భయంలేదు కాని, ఈ వాసన కొంచెం దుర్భరంగా ఉందిరా" అన్నాడు సీతాపతి.

